# కళ్ళలో మిలమిల

ఆవిడ ఎవరు? భ్రమరా!

ఔననిపిస్తోంది. కాదనిపిస్తోంది.

అంతలో నా దగ్గరగా వచ్చి పలకరించింది.

పేరంటానికి వెడుతుంటే అక్కడ భ్రమరని చూస్తానని అనుకోలేదు. అక్కడ భ్రమరని చూడటం కాదు నా ఆశ్చర్యానికి కారణం. ఆ భ్రమరేనా ఈ భ్రమర అనిపించేటంతగా మారిపోయింది.

భ్రమరా, నేనూ ఒక ఊరివాళ్ళం.

ఒకే స్కూల్లో, ఒకే క్లాసులో చదువుకున్నాం.

భ్రమర అప్పుడు సన్నగా, పీచుజుట్టుతో ఎలాగో వుండేది.

గడ్డంమీద ఆ పుట్టుమచ్చ లేకపోతే ఇప్పుడు పోల్చుకోలేకపోయేదాన్నే.

పెళ్లి అంత మార్పు తెస్తుందా!

పట్టుచీర కట్టుకుంది. కొత్తచీరలాగే ఉంది.

వరలక్ష్మి వ్రతానికి కొనుక్కుందేమో!

బుగ్గలు మిసమిసలాడిపోతున్నాయి! మీగడ, తేనె రాస్తోందా? కళ్లు మిలమిలలాడుతున్నాయి. పళ్లూ.... పాలు తాగుతుంది కాబోలు! పెదవులు నవ్వులు కురిపిస్తున్నాయి!

మొగుడు తను గీసిన గీత దాటడు కాబోలు!

మనిషి నియాన్ బల్బులతో వెలిగే పేరులా కళ్ళకి మిరుమిట్లు గొల్పుతోంది. అదృష్టమంటే అది!

నాకూ పెళ్ళయింది!.... నాకూ అయింది పెళ్ళి!

ఒక నిట్టూర్పు..... అణుచుకున్నాను.

''నువ్వేం మారలేదు'' అంది నన్ను ఎగాదిగా చూసి.

ఎందుకనదూ.

తను గొంగళిపురుగులా వుండేది.

సీతాకోకచిలుకలాగ మారింది.

ఈకలు పీకిన కోడిపిల్లలా వుండేది.

పోషణ బాగున్న ఆవులా తయారైంది.

కూలిపోతున్న గుడిసె పీకేసి చూడచక్కని మేడ కట్టినట్టుంది.

నేను మారలేదు.

ఎంత మారాలని నాకు వున్నా కాలం ఖర్మ కలసిరావటం లేదు. నాకంటే తక్కువ చదివింది.

నాకంటె అందంలోనూ తక్కువే.

మా నాన్నగారు లెక్చరరు. వాళ్ళ నాన్న టీచరు. ఐతేనేం!

ఇప్పుడు అన్నివిధాలా పైమెట్టు మీద నిలబడినట్లుగా వుంది.

పరుగు పందెంలో గెలిచినట్లుగా వుంది.

నన్ను చూసి నవ్వుతున్నట్టుగా వుంది. ఐనా అన్నీ భరిస్తూ.

''ఈ ఊరు ఎప్పుడు వచ్చారు? ఎక్కడ ఆయనకి ఉద్యోగం?'' అని అడిగాను.

చెప్పింది. ఇంకా ఆశ్చర్యం వేసింది. వాళ్ళాయన కూడా మావారి ఆఫీసే. అదే సెక్షన్, అదే ఉద్యోగం పేరు చెప్పింది. మారుతీరావ్‌ట! వాళ్ళకీ మాలాగే ముగ్గురు పిల్లలు. పేరంటం నించి ఇంటికి వచ్చేటప్పటికి వొళ్ళు మండిపోతోంది. కడుపులో మంట! గుండెలో మంట! కళ్ళలో మంట! పిల్లలు చదువు కుంటున్నారు. ఆయన కాఫీ తాగుతున్నారు. కోపమేనా, బాధేనా ఉంటే నోట్లోంచి మాట రాదు నాకు. చీర మార్చుకుని వచ్చి మాట్లాడకుండా కూర్చున్నాను.

''అదేమిటీ అట్లాగున్నావ్! పేరంటం సంగతులు ఏమిటీ!'' అనడిగారు ఆయన.

ఇంట్లోవుంటే ఆయనకి నన్ను నఖశిఖపర్యంతం పరీక్షించటం, నా మూడ్సుని విమర్శించటం, ప్రశ్నించటం తప్ప వేరే పనిలేదు. ఒక్కొక్కప్పుడు

దృష్టి నామీదే వుండటం ఆనందంగానే వుంటుంది కానీ, యిట్లాంటప్పుడు వొళ్లు మండుతుంది.

''ఆ. ఏముంటాయి నాలాంటిదానికి!'' అన్నాను.

''నీకేం తక్కువైంది ఇప్పుడూ!'' అన్నారు కనుబొమలు ఎగరేస్తూ.

''నాకేం తక్కువ!

ఎప్పుడు పేరంటానికి వెళ్ళినా అదే పట్టుచీర. పెళ్ళినాటిది. పదేళ్ళు పాతది.

పెళ్ళికి అమ్మగారొక పట్టుచీర, అత్తగారొక పట్టుచీర పెట్టారు. అత్తగారిది చిరిగిపోయింది. అమ్మగారిది మిగిలింది. పేరంటం వచ్చినా, పెళ్ళికి వెళ్ళినా అదే.

పట్టుచీర కొనమని ఏ పండగకైనా మనసుపడి అడిగితే –

''నేనేం ఆఫీసర్నా, లంచాలు పోగేసుకుంటున్నానా? బిజినెస్ మేన్‌నా?'' అంటూ తనొక మహాత్ముడైనట్లు మాట్లాడతారు. మళ్ళీ ఊరడిస్తూ

''మన బుజ్జి పెళ్ళికి కొంటాలే!'' అంటారు.

మా అమ్మాయికి త్వరగా పెళ్ళిచేస్తే ఇంకో పదిహేనేళ్ళ మాట.

అప్పటికి పట్టుచీర ధర వెయ్యి దాటుతుందేమో?

నేను మాట్లాడలేదని.

''నాలాంటిది అంటే?'' అన్నారు నన్ను రెచ్చగొడుతూ.

''మొగుడి ఆదరణకి నోచుకోనిది'' అన్నాను కసిగా.

ఫక్కున నవ్వేశారు.

''నువ్వు నోచుకోకపోవటమేమిటి? శ్రావణమాసం నోములు, మూగనోము, అట్లతద్ది నోమూ, చాలానే నోచావు. ఏం, నేను నిన్ను వదిలేశానా? తిండి, గుడ్డ యిస్తున్నాను. శుభ్రమైన కొంపలో వుంచాను. ఈ కాలంలో యింతకంటే యెవరికైనా ఏం దొరుకుతుందీ!'' అన్నారు.

''ఆ. యిస్తున్నారులెండి. చాలా గొప్ప గుడ్డలు!'' అన్నాను ఆపుకోలేక. అసలు పాయింటు పట్టేశారు.

''పేరంటానికి యెవరైనా కొత్త పట్టుచీర కట్టుకొచ్చారా?''

''ఎవరో ఏమిటి? అందరూనూ''

''నువ్వుతప్ప!'' అన్నారు నవ్వుతూ.

నాకు నవ్వు రావటం లేదు. నేనేం హాస్యాలాడటం లేదు. నాకు నిజంగా బాధగా ఉంది. ఔను. నేను తప్ప ఈలోకంలో అందరూ అందంగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉన్నారు.

''వెధవ పట్టుచీర కట్టుకుంటే ఏమొస్తుంది. గరగరలాడుతూ చెమటలు పోస్తూ, మూడువందలకి తక్కువకి రాదు.''

''కొనలేకపోతే ఊరుకోండి. వెధవ పట్టుచీర అనకండి,'' కసురుకున్నాను.

''సరే. వెధవ పట్టుచీర కాదు. కంచి పట్టుచీరే. కొనమని ప్రాణం తియ్యటమేగానీ కొన్నాక కట్టుకోవడం వుండదు. సినిమాలకి, సరదాగా వెళ్ళటానికీ పనికిరాదు. పెట్టెలో ఓ మూలపడి ఉంటుంది. అసలు ఏం కట్టుకున్నావ్ అని కాదు ప్రశ్న. ఎట్లా కనిపిస్తున్నావ్ అన్నది ముఖ్యం.

వందరూపాయల్లోపునే ఎంత చక్కటి చీరలు - మెత్తగా పల్చగా - వస్తున్నాయి! నన్నడిగితే పట్టుచీర కొనుక్కోవటంకంటే బి-కాంప్లెక్స్ ఇంజెక్షన్స్ తీసుకోవటం మంచిదంటాను. మనిషికీ ఆ మెరుపు ఏ చీరా, నగా ఇవ్వలేవు.''

నాకు నవ్వు వచ్చేసింది.

''సరే. ఆ ఇంజక్షన్లే ఇప్పించండి'' అన్నాను.

* * *

తెల్లారింది మళ్ళీ మామూలు.

అది కావాలి! ఇది కావాలి!

అది లేదు! ఇది లేదు.

ఒక్కటే పల్లవి

ఎట్లాగో వంట అయింది.

ఆయన ఆఫీసుకి, పిల్లలు స్కూళ్ళకి వెళ్ళారు.

పంచదార అయిపోయింది. సాయంత్రం కాఫీలోకికూడా లేదు.

పంచదారలేకుండా కాఫీ యివ్వటం నావల్లకాదు.

బజారుకి బయలుదేరాను. ఎక్కువ దూరంలేదు దగ్గరే పంచదార తీసుకున్నాను. వీక్లీ వచ్చిందేమో చూద్దామని పుస్తకాల షాపుకి వెడుతున్నాను.

క్వాలిటీ దగ్గర నా కాళ్ళు ఆగిపోయాయి.

మీఠాపాన్ నములుతూ బయటకు వస్తోంది భ్రమర. నన్ను చూసింది.

''ఒక్క ఐదు నిముషాలు ముందర వస్తే కలిసి తిని వుండేవాళ్ళం కట్‌లెట్స్, ఐస్‌క్రీమ్. యిక్కడ చాలా బాగుంటాయి. నేను యిక్కడికే వస్తాను'' అంది భ్రమర.

పెదవులు ఎర్రగా పండాయి. భ్రమర ఈ వూరికి వచ్చి నాలుగు నెలలైందేమో! అప్పుడే ఎక్కడ ఏది బాగుంటుందో తెలిసిపోయింది.

నేను పదేళ్ళనించి వుంటున్నాను. ఎక్కడ ఏ సినిమా హాలుందో కూడా తెలీదు. నాకు నోటిలోంచి మాట రావటం లేదు.

''నేను ప.... ప.... పంచదారకోసం వచ్చాను'' అన్నాను తడబడుతూ.

''వెధవ మార్కెటింగ్ అంటే నాకు చిరాకు. అన్నీ ఆయనే తెచ్చి పడేస్తారు. 'రీగల్'లో 'ఇంటింటి రామాయణం' ఉంది. నువ్వుకూడా రాకూడదూ!'' అంది.

తను వెడుతోందన్నమాట.

అందరికీ తనలాగ వీలౌతుందా?

అదృష్టం ఉండాలి.

పెట్టిపుట్టాలి.

నేనూ పుట్టాను. వండి పెట్టటానికి, సంచులు మొయ్యడానికి, నిందలు పడటానికి.

''ఎంత చేసినా మెప్పులేదు. ఉప్పు తక్కువైంది. కారం ఎక్కువైంది. మా బామ్మ ఆవడలు - నా చిన్నతనంలో జగన్మోహినీ విలాస్‌లో......''

ఇవన్నీ వింటూ పిచ్చెక్కకుండా శిలలా భరించటానికే పుట్టాను.

''ఏమిటల్లా ఆలోచనలో పడిపోయావ్. చెప్పి రాలేదనా, ఒంటిగంటకి యింటికి వెళ్ళిపోతాం.... మార్నింగ్ షో కదా'' అంది భ్రమర.

''అదేం కాదు. ఇవేళ బుధవారం చాకలి వస్తాడు. ఇంట్లో వుండాలి. లేకపోతే మళ్ళీ వారందాకా రాడు'' అన్నాను.

భ్రమర నవ్వింది. వెళ్ళిపోయింది.

నా కాళ్ళు వెనక్కి తిరిగాయి.

తలకూడా తిరుగుతున్నట్టుగానే వుంది.

ఎంత వద్దనుకున్నా నాకూ కోరికలు వున్నాయి.

నేనూ మనిషిననని గుర్తు చేస్తుంటాయి.

ఆయన స్కూటర్‌మీద వెనక కూర్చుని చల్లగాలిలో షికారు చెయ్యాలని. మంచి ఎయిర్ కండిషన్డ్ రెస్టారెంట్‌లో ఐస్‌క్రీమ్ తినాలని, మెత్తటి కుషన్ కుర్చీల్లో ఆయన పక్కన కూర్చుని ఒక సంగీత ప్రధానమైన ప్రణయగాథ చూడాలని.

వెన్నెల్లో పిట్టగోడమీద కూర్చుని చందమామని చూస్తూ కబుర్లు చెప్పుకోవాలని.

చాలా కోరికలు మరచిపోతున్నాను కూడా. ఆయనకి స్కూటర్ యిష్టం లేదు. భయమా అంటే ఒప్పుకోరు. ఎప్పుడో కారు కొంటాలే అంటారు.

బయట ఏమైనా తిందామంటే -

''అసలే కల్తీరోజులు, ఎక్కడ చూసినా జాండీస్! జబ్బులు వస్తాయి'' అంటారు.

వెళ్ళక వెళ్ళక సినిమాకి వెడితే క్యూలో అరగంట నిలబడటం... మూడుగంటలు కూర్చోలేక కూర్చోవటం... తలా తోకా లేని కథలూ విపరీతార్థాల పాటలూ.... తలనొప్పితో ఇంటికి రావటం. ఈ ఇంట్లో ఏరోజు అమావాస్యో, ఎప్పుడు పూర్ణిమో కూడా తెలీదు. ఆకాశమే కనబడదు.

భ్రమర ఇట్లాగ ఐస్‌క్రీములూ, రసగుల్లాలూ తింటుందన్నమాట! అందుకే అట్లాగ నున్నగా.... కళ్ళలో మిలమిలలు.

నేను అట్లాగ మారగలనా? ..... ఎప్పటికైనా!

ఈ దేశం బాగుపడినప్పుడే!

ప్రతి మనిషికీ ఉద్యోగం, ఇల్లు, పౌష్టికాహారం ప్రభుత్వం ఇవ్వగలిగినప్పుడు!

బాగా తినాలని, అందంగా వుండాలని, సభలకీ సమావేశాలకీ తిరగాలనీ నాకూ వుంటుంది.

కానీ ఎన్ని ఖర్చులు! ముందర తిండి గడవాలి. పిల్లల అవసరాలు తీరాలి. అప్పటికింక మిగిలేది వుండదు.

మార్పు యెక్కడనించి వస్తుంది? ఎట్లా వస్తుంది?

లాటరీ రావాలి.

ఆయనకి ప్రమోషన్ రావాలి.

నేను ఉద్యోగం చెయ్యాలి.

అన్నీ అసంభవాలే.

మనదేశంలో ఆడవాళ్ళు ఉద్యోగం చేసే పరిస్థితులు లేవు.

ఇప్పుడున్న సుఖంకూడా వుండదు. ఇద్దరం చాకిరీచేసి అలిసిపోతే పిల్లల్నెవరు చూస్తారూ!

ఫ్రిజ్‌లూ, పట్టుచీరలూ కాదు. పిల్లలు బాగుపడటం, నువ్వు నవ్వుతూ తిరగటం కావాలి అంటారు.

మాటల్తో బోల్తా కొట్టిస్తారు. స్వాధీనపతికను కాదు నేను. నవ్వుతూ తిరగాలిట! నవ్వు వూరికే వస్తుందా?

నవ్వు ఖరీదు ఎంత?

అందం, ఆరోగ్యం, ఆనందం వుంటే నవ్వు వస్తుంది.

అందం, ఆనందం, ఆరోగ్యం!

అందరాని ఆకాశంలో వున్న ఖరీదైన వస్తువులు! ఆకాశంలో వున్నాయని నేను అనుకుంటున్నానేమో!

భ్రమరకెలా అందాయి? తనూ ఉద్యోగం చెయ్యటం లేదు.

మారుతీరావూ, మావారూ ఒకే ఆఫీసులో, ఒకే పని.... ఒకే జీతం. అతను లంచాలు తీసుకుంటాడా? లేకపోతే భ్రమర చాకచక్యమా!

లేకపోతే నా చాతకానితనం.... తెలివితక్కువ కాబోలు. పుస్తకాల షాప్‌కి వెళ్ళలేదని, మరిచిపోయానని ఇంటి మెట్లు ఎక్కుతుంటే గుర్తు వచ్చింది.

భ్రమర ''ఇంటింటి రామాయణానికి'' వెళ్ళింది.

నేనూ.... బాధాపురాణం పారాయణం చేస్తున్నాను.

* * *

అప్పుడే ఇడ్లీకి పప్పురుబ్బటం అయింది. చెయ్యి కడుక్కుంటున్నాను. భ్రమర వచ్చింది. రెండు నిముషాల ముందర వచ్చి వుంటే నా అవతారం చూసి వుండేది నయమే.

భ్రమర యెప్పుడైనా వస్తుంది బోలెడు కబుర్లు చెప్తుంది.

డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాం.

''పని వుండి వచ్చాను త్వరగా వెళ్ళాలి. ముత్యాలు కొన్నాను. నెక్లెస్ చేయించుకుందామనుకుంటున్నాను. నీది, నీపెళ్ళికి మీ అత్తవారు పెట్టారూ... ఇన్ని డిజైన్లు చూశానుకానీ.... అట్లాంటిది మళ్ళీ నేను చూడలేదు. నాకు చాలా నచ్చింది. అటువంటిదే చేయించుకుందామనుకుంటున్నాను. అసలు జూవెలరీ షాప్‌లో చూపించి ఇట్లాగే చెయ్యగలడో, లేదో అడుగుతాను పని అయిపోగానే తెచ్చిస్తాను'' అంది.

నాకు సంతోషం వేసింది. ఒకరు మెచ్చుకోగల వస్తువు నాదగ్గర ఉన్నందుకు, దానికోసం భ్రమర నాదగ్గరకు వచ్చినందుకు. వెంటనే లోపలికి వచ్చి బీరువా తీసి పెట్టె తీసుకువచ్చి భ్రమర చేతికి యిచ్చాను తెరిచి చూసి.

''ఇదే. నాకు బాగానే గుర్తుంది. ఇటువంటిదే చేయించుకుంటాను'' అంది సంతోషంగా.

''కాఫీ ఇస్తాను'' అంటున్నా వినకుండా వెళ్ళిపోయింది. తరువాత నాకు స్పృహ వచ్చినట్లయింది. నా వస్తువును తొందరపడి ఇవ్వలేదుకదా!

భ్రమర జాగ్రత్తగా తీసికెడుతుందా? అసలే రోజులు బాగాలేవు.

పోతే మళ్ళీ చేయించుకునేమాట వుట్టిది.

పదేళ్ళు గడిచాయి కానీ, వీసమెత్తు బంగారం కొనలేదు.

ఇవ్వాల్సింది కాదేమో! కానీ ఏమని సమాధానం చెప్తాను.

మనసులోకి ఏదో బెంగ ప్రవేశించింది.

రాత్రి భోజనాలు చేస్తున్నప్పుడు ఆయనకి చెప్పాను నగ యిచ్చినట్లు.

* * *

మర్నాటినుంచే భ్రమర వస్తుందని యెదురు చూడటం మొదలుపెట్టాను. రెండురోజులు గడిచిపోయాయి.

పుస్తకాలు తెచ్చుకుందామని రమా వాళ్ళింటికి వెళ్ళాను.

భ్రమర అక్కడ వుంది. రమతో ఈమధ్యనే స్నేహమయింది. భ్రమరకి కాఫీ చేస్తానని రమ కిచెన్‌లోకి వెళ్లింది. భ్రమర నా పక్కనే కూచుని ''మా షాప్ అతను చేస్తానన్నాడు. ఆరోజే చూపించి తెచ్చాను. పదిరోజుల్లో చేసి ఇస్తానన్నాడు. మీ ఇంటికి నిన్ననే వద్దామనుకున్నాను. బాబుకి జ్వరం వచ్చింది. రేపు వచ్చి ఇస్తాను'' అంది.

''తొందరేం లేదు'' అన్నాను. సురక్షితంగానే ఉంది కదా.

మర్నాడు భ్రమర రాలేదు. వాళ్ళ బాబుకి ఎట్లా ఉందో!

నాలుగురోజుల తర్వాత రమ మా ఇంటికి వచ్చింది. మాటలమధ్య ''భ్రమరగారు నీకు బాగా తెలుసా?'' అనడిగింది.

''చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం. ఇప్పుడు ఇద్దరి భర్తలూ ఒకే ఆఫీసులో, ఒకే ఉద్యోగం'' అని చెప్పాను.

''చూసిన వస్తువులన్నీ కొంటుంది. సినిమాలూ, హోటళ్ళకీ తిరుగుతుంది. లంచాలుల తీసుకుంటాడేమో ఆయన'' అంది.

''ఏమో!'' అన్నాను.

తర్వాత ఆ మాటే ఆయనని అడిగాను.

''మారుతీరావు అటువంటివాడు కాదు'' అన్నారు. ఆరునెలల్లోనే మనిషిని కాచి వడబోసినట్లు. చదివి పారేసినట్లు.''

* * *

నెల దాటింది. భ్రమర మళ్ళీ కనిపించలేదు. రాలేదు.

నాకు వెళ్ళడానికి, అడగటానికి మొహమాటంగా ఉంది.

అప్పు యిచ్చిన వాడిదికాదు, తీసుకున్నవాడిది పైచేయి.

రమ, నేను బజారుకి వెళ్ళాం.

క్వాలిటీ దగ్గరికి రాగానే ''కాఫీ తాగుదాం'' అంది రమ.

ఇద్దరం ఒకలాంటివాళ్ళమే.

''ఐదు రూపాయలకి నాలుగు కూరలు వస్తాయి. రెండు పుస్తకాలు వస్తాయి'' అని ఆలోచిస్తాం.

ఎప్పుడేనా కాఫీకి మాత్రం కక్కుర్తి పడతాం. అదీ కలిసి వెళ్ళినప్పుడే.

టేబుల్ వెతుక్కుంటూ చూశాను. భ్రమర కూర్చుని వుంది. చప్పున ప్లేట్ మీదికి వెళ్ళాయి నా కళ్ళు. రస్‌మలాయి! భ్రమర మమ్మల్ని చూడలేదు. తింటోంది.

రమ నన్ను కూడా మరచిపోయినట్లు గబగబా వెళ్ళింది.

''మీరు నా గాజు ఇవ్వలేదు. మావారు కోప్పడుతున్నారు నన్ను'' అంది.

''ఏం గాజూ, నాకేం తెలుసూ'' అంది భ్రమర ఆశ్చర్యంగా చూస్తూ.

రమ అక్కడే విగ్రహంలా నిలబడిపోయింది.

భ్రమర ప్లేట్లో డబ్బులు పడేసి నాదగ్గరికి వచ్చింది.

''మా వదిన వచ్చింది. ఒక వారం వుంటుంది. నిన్ను చూడాలని వుందిట. మా ఇంటికి రా!'' అంది నవ్వుతూ.

ఆ ఆహ్వానంలో ఆప్యాయత వుంది.

తల వూపాను. వెళ్ళిపోయింది.

రమ వచ్చి నా పక్కన కూలబడింది.

గాజులు ఏమిటో అడగాలనిపించింది.

బేరర్ కాఫీకప్పులు తెచ్చి పెట్టాడు.

రమ సిప్‌చేసి పెట్టేసింది.

''భ్రమరగారు నా గాజులుచూసి చేయించుకుంటాను. మాదిరికి కావాలని అడిగి ఒక బంగారు గాజు తీసికెళ్ళింది. ఇప్పటిదాకా తెచ్చి యివ్వలేదు. ఇప్పుడు అడిగితే ఏం గాజులూ అంటోంది. ఇప్పుడు నేను ఏం చెయ్యనూ......''అంది.

నాకు చెమటలు పోస్తున్నాయి.

రమ మాటల్లో నాకు నమ్మకం వుంది. రమ నాకు తెలుసు.

చిన్నప్పటి భ్రమర నాతో ఆడుకుంది. కానీ ఇప్పటి భ్రమర వ్యక్తిత్వం నాకు తెలియదు.

నాకు భయం వేసింది. నాలుగు వేలైనా చేస్తుంది. నా నెక్లెస్ నాకు దక్కదేమో అనిపిస్తోంది. కాఫీ తాగలేకపోయాను.

రమ అవస్థ కూడా అలాగే వుంది.

ఐనా నా రహస్యం నేను రమకి చెప్పలేకపోయాను.

అది నాకు దక్కితే చాలు అనిపిస్తోంది.

రమ మీద సానుభూతికూడా కరువైపోతోంది. తెలివితక్కువవాళ్ళం... ఇద్దరం మోసపోయాం.

* * *

జరిగిందంతా ఆయనకి చెప్పాను.

భ్రమర ఇంటికి వెళ్ళాను. నిజంగానే వాళ్ళ వదిన వచ్చింది. చిన్నప్పటి సంగతులన్నీ గుర్తు చేసుకున్నాం.

ఆవిడ మాకంటే పెద్దది. మాకు పూలు మాలకట్టి యిచ్చేది.

మాతో చింతగింజలూ, గచ్చకాయలూ ఆడేది. జామచెట్టు ఎక్కి కాయలు కోసి పెట్టమనేది.

భ్రమర పూరీకూడా చేసింది. చాలా రుచిగా వుంది. వద్దు అంటున్నకొద్దీ తినిపించింది. వాళ్ళ వదిన యెదుట నెక్లెస్ సంగతి యెత్తలేకపోయాను.

అడగకుండానే ఇంటికి వచ్చాను.

మర్నాడు రమ వచ్చింది.

భ్రమర ఇంటికి వెళ్ళి అడిగిందట గాజు కోసం.

''అప్పుడే ఇచ్చేశాను కదా!'' అందిట.

నేను నెక్లెస్ సంగతి చెప్పాను.

''ఐతే నీ వస్తువుకీ తిలోదకాలే. అన్నీ అమ్ముకుని డబ్బు చేసుకుంటోంది. అంతే కాదు. ఇంకా చాలా రాబడి వుంది. ఈ డబ్బు వడ్డీలకి కూడా ఇస్తుందిట'' అంది.

రోజంతా వ్యధతో గడిచింది.

రాత్రి భోజనం చెయ్యలేకపోయాను.

ఆయన గమనిస్తూనే వున్నారు.

''ఏమైంది! అందరూ నీలాగ భోజనం చేస్తే దేశంలో తిండి కరువు వుండదు. రేషన్‌లో యిచ్చేదానితో బతికెయ్యోచ్చు'' అన్నారు.

జరిగిందంతా చెప్పాను. ''ఇంక నా నెక్లెస్ నాకు రాదు'' అంటుంటే కళ్ళలో నీళ్ళు వచ్చాయి.

''ఎవరికి ప్రాప్తం వుంటే అక్కడికి వెడుతుంది'' అన్నారు నవ్వుతూ.

నాకు బాధపోయి కోపం వచ్చింది. చెయ్యి కడిగేసుకుని వెళ్ళి పక్క ఎక్కాను. వెనకాలే వచ్చి తలవైపు నిలబడి, ''తెలివి తక్కువ, కోపం ఎక్కువ'' అన్నారు.

గబుక్కున లేచి కూచున్నాను.

''చేతకానివాళ్ళే ప్రాప్తం లేదంటూ చేతులు దులిపేసుకుంటారు'' అన్నాను.

ఆయన నా మొహంలోకి దీర్ఘంగా, సుదీర్ఘంగా చూశారు.

వరాలు కోరిన కైకేయి మొహంలోకి దశరథుడు అలాగ చూశాడేమో.

''మారుతీరావ్ మంచివాడు'' అన్నారు. ఆయన నవ్వటం లేదు. అంటే బాధపడుతున్నారు నిజంగా.

* * *

మూడురోజులు గడిచాయి.

ఆ విషయం నేను యెత్తలేదు. ఆయనా ఏమీ అనలేదు.

నాలుగవరోజు సాయంత్రం ఆఫీసునించి యింటికి రాగానే బ్రీఫ్‌లోంచి నెక్లెస్ తీసి మంచంమీద పడేశారు.

ఒక్క ఉదుటున వెళ్ళి పెట్టె తెరిచి చూశాను.

నా నెక్లెస్ చెక్కుచెదరకుండా వుంది.

''నీకు ప్రాప్తం వుంది'' అన్నారు. కానీ - ఆయన మొహంలో సంతోషం లేదు. ఏదో బాధ అనుభవిస్తున్నట్లుగా వుంది. నాకు మాత్రం సంతోషంగా.... గర్వంగా కూడా వుంది. నిజమే! ప్రాప్తం! నాది మళ్ళీ నా చేతుల్లోకి వస్తుందనుకోలేదు.

''ఎట్లా... వచ్చింది? ఎలా తెచ్చారూ'' అనడిగాను.

వెంటనే గుర్తువచ్చి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాను.

మెల్లిగా తాగి గ్లాసు పెట్టేశారు.

''ఆ రోజు మారుతీరావుతో చెప్పాను. అతడు నామాట నమ్మాడు. నువ్వు వాళ్లావిడకి నెక్లెస్ ఇచ్చావని నమ్మాడు. 'ఇప్పుడు ఇల్లాగ మొదలెట్టిందన్నమాట!' అన్నాడు. ఇదివరకు ఏం చేసిందో మరి! ఇంటికి వెళ్ళి ఆవిడని బాగా కొట్టాడుట. చావబాదాడు. అప్పుడు చెప్పిందిట ఇంకా నెక్లెస్ అమ్మలేదు. తాకట్టుకి పెట్టి వెయ్యిరూపాయలు తీసుకుందిట. షాప్‌పేరు చెప్పింది. డబ్బు తెచ్చి విడిపించి ఇస్తానన్నాడు. నేను ఒప్పుకోలేదు. నేనే విడిపించుకుంటానన్నాను. చివరికి ఇద్దరం చెరిసగం.... ఐదువందలు ఇచ్చి.... తెచ్చాను ఇవేళ'' అన్నారు.

'' ఈమూడురోజులూ యింత కథ నడిచిందన్న మాట.''

నా మొహంలో రక్తమంతా యిగిరిపోయింది.

మారుతీరావు భ్రమరని కొట్టాడు.

భర్త భార్యని కొట్టాడు.

మారుతీరావు మంచివాడు.

అతడు యెందుకు భార్యని కొట్టాల్సి వచ్చిందీ?

అప్పుడు ఎంత బాధపడి వుంటాడూ!

అంతకీ కారణం కోరికలేనా!

సవ్యంగా సాగినంతసేపే కోరికల అందం.

నాకు సిగ్గు వేస్తోంది. భ్రమరని చూసి అసూయపడినందుకు.

నాకు కోరికలు వద్దు.

కళ్ళలో మిలమిలలూ వద్దు.

బుగ్గల్లో నవనవలూ వద్దు.

డబ్బుతెచ్చే సుఖాలూ వద్దు. ఆ నరక బాధా వద్దు.
మధ్యతరగతివాళ్ళం.
తృప్తియిచ్చే చిరునవ్వే చాలు.
అదే పది నగలపెట్టు.
అదే శ్రీరామరక్ష మాకు!

ఆంధ్రజ్యోతి 'దీపావళి' సంచిక, 1981

* * * *